శ్రీ శుకబ్రహ్మాశ్రమము
గ్రంథములు

	రూ. పై
1. గీతామకరందము	70-00
2. GITA MAKARANDA	70-00
3. యోగవాసిష్ఠ రత్నాకరము	60-00
4. రామాయణ రత్నాకరము	50-00
5. భారత రత్నాకరము	50-00
6. భాగవత రత్నాకరము	50-00
7. ఉపనిషద్రత్నాకరము	40-00
8. గీతోపన్యాసములు	30-00
9. మోక్షసాధన రహస్యము	30-00
10. పరమార్థ కథలు	30-00
11. బ్రహ్మచర్య విజయము	30-00
12. అధ్యాత్మరామాయణము	15-00
13. ఆత్మానుసంధానము	15-00
14. బ్రహ్మానంద వైభవము	15-00
15. భజన కీర్తనలు	15-00
16. శ్రీ వాసిష్ఠమహారామాయణము	15-00
17. అమృత బిందువులు	15-00
18. శ్రీమద్భగవద్గీత (స్థూలాక్షరి)	15-00
19. శ్రీమద్భగవద్గీత (మూలం)	5-00
20. వివేకానంద సింహనాదము	15-00
21. యమలోక వార్తలు	4-00
22. శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల జీవిత చరిత్ర	20-00
23. తత్వసారము	3-00
24. మానసబోధ	3-00
25. పాండవ గీత	3-00
26. అధ్యాత్మ జడ్జిమెంటు	3-00
27. ధ్యాన పద్ధతి	2-00
28. వైరాగ్య సాధన	2-00
29. మట్టిలో మాణిక్యము	2-00
30. ప్రణవ పూజ	2-00
31. గౌరీ పూజావిధానము	2-00
32. ద్వాదశమంజరి	2-00
33. మోక్షద్వారపాలకులు	2-00
34. ఆత్మతత్వవిచారణ	2-00
35. ఆధ్యాత్మ హితోక్తులు	2-00

కేసట్లు

1. శ్రీ స్వామివారి ఉపన్యాసము (కేసెట్ 1 అధ్యాయం)	35-00
2. తత్వసారము	35-00
3. మానసబోధ	35-00
4. తత్వగీత	35-00
5. యతిగీత	35-00

శ్రీ స్వాములవారి వీడియో కేసెట్స్
ఒక కేసెట్ రూ. 140/-
మొత్తము సెట్ రూ. 2,250/-

మాసపత్రిక

వేదాంతభేరి సంవత్సర చందా	30-00
శాశ్వత చందా	300-00

గ్రంథములు కావలసిన వారు ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

మేనేజరు
శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు
శ్రీకాళహస్తి-517640, చిత్తూరుజిల్లా

పాండవగీత



ము ము

వెల: రూ. 3-00

శ్రీశు

పాండవ గీత

రచయిత:
శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాముల వారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీకాళహస్తి
1994

వెల: రూ. 3-00

ప్రతులకు:

మేనేజరు,
శ్రీ శుక బ్రహ్మాశ్రమము
శ్రీ శుక బ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీ కాళహస్తి (చిత్తూరు జిల్లా) A.P.
Pin - 517 640
Phone: 2239 (P) 2543

All rights reserved
సర్వ హక్కులు ప్రకాశకులవి

ముద్రణ

శ్రీ కృష్ణచిత్ర ప్రింటర్స్
4, నాగేశ్వరరావు వీధి,
టి. నగర్, మద్రాసు - 600 017
ఫోన్: 441286

ప్రస్తావన

భక్తి రసాత్మకమైన పెక్కు మహత్తర శ్లోకములతో గూడిన గ్రంథమే ఈ పాండవగీత. ఇందు కేవలము పాండవులేకాక ఇంకను అనేకమంది మహర్షులు వచించిన దివ్యబోధలు కలవు. మూలశ్లోకములకు తెలుగు తాత్పర్యమును కూడ చేర్చి ఈ పుస్తకము ప్రకటింపబడినది. సాధకులగు భక్తుల కీ గ్రంథము ఎంతగనో ఉపకరించగలదని విశ్వసించు చున్నాము.

ఓమ్

ఇట్లు,

ప్రకాశకులు.

"వే దాం త భే రి"

"మనశ్శాంతికి మహదవకాశం"

(గీతామకరంద రచయిత శ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి సందేశము ప్రతి నెల తెలుసుకొన వచ్చును.)

మహర్షుల చరిత్రలు, దేవాలయాల చరిత్రలు, ఆరోగ్య సూత్రములు, మహనీయుల సదుపదేశములు, సంస్కృత భాషా శిక్షణ, మొదలగు ఎన్నో నూతన విషయములను తెలుసుకొనదలంచినారా? అయినచో 'వేదాంత భేరి' మాస పత్రిక చదవండి. మనశ్శాంతిని పొందండి. క్రింది అడ్రసుకు M.O. ద్వారా రూ. 30-00 లు పంపి పొందవచ్చును.

సంవత్సర చందా రూ. 30-00 లు మాత్రమే

అడ్రసు: వేదాంతభేరి కార్యాలయము
సూర్యారావు పేట
P.B. No. 323
విజయవాడ - 520 002

పాండవగీత

పాండవ ఉవాచ—

ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీ
న్పుణ్యానిమాన్పరమ భాగవతా న్స్మరామి. 1

తా॥ ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు, భీష్ముడు, దాల్భ్యుడు, రుక్మాంగదుడు, అర్జునుడు, వసిష్ఠుడు, విభీషణుడు—మున్నగు ఈ పుణ్యాత్ములైన భగవద్భక్తులను నేను స్మరించుచున్నాను.

లోమహర్షణ ఉవాచ—

ధర్మో వివర్ధతి యుధిష్ఠిర కీర్తనేన
పాపం ప్రణశ్యతి వృకోదర కీర్తనేన
శత్రుర్వినశ్యతి ధనంజయ కీర్తనేన
మాద్రీసుతౌ కథయతాం నభవన్తిరోగాః. 2

లోమహర్షణుడు చెప్పెను—

తా॥ ధర్మరాజుయొక్క సంస్మరణముచే ధర్మము లెస్సగా వృద్ధి నొందును. భీముని స్మరించుటచే పాపము నశించును. అర్జునుని తలంచుటచే శత్రువులు నశింతురు. నకుల సహదేవులను గూర్చి స్మరించుటచే రోగములు తొలగి పోవును.

బ్రహ్మోవాచ—

యే మానవా విగతరాగ పరావరజ్ఞా
నారాయణం సురగురుం సతతం స్మరన్తి
ధ్యానేన తేన హతకిల్బిషచేతనాస్తే
మాతుః పయోధరరసం నపునః పిబన్తి. 3

బ్రహ్మదేవుడు చెప్పెను—

తా॥ ఏ మానవులు దేహాది దృశ్య పదార్థములందు విరాగము గలవారై, ప్రకృతికి పరుడగు పరమాత్మయొక్క తత్త్వమును దెలిసికొని దేవతలకును గురువైన అట్టి శ్రీమన్నారాయణుని నిరంతరము స్మరించుచుందురో, ఆ ప్రకారమగు ధ్యానముచేత పాపములు నశించిన చిత్తము గలవారై వారు తల్లిపాలు మరల త్రాగకుందురు. (పునర్జన్మ రహితులగుదురు.)

ఇంద్ర ఉవాచ—

నారాయణో నామ నరో నరాణాం
ప్రసిద్ధచోరః కథితః పృథివ్యామ్
అనేక జన్మార్జిత పాపసంచయం
హరత్యశేషం స్మరతాం సదైవ. 4

ఇంద్రుడు చెప్పెను—

తా॥ భూమిపై నారాయణు డను ప్రఖ్యాత చోరుడు కలడు. అతడు తన్ను స్మరించువారియొక్క అనేక జన్మార్జిత పాపసముదాయము నెల్ల నిశ్శేషముగ సదా హరించి వేయును.

యుధిష్ఠిర ఉవాచ—

మేఘశ్యామం పీతకౌశేయవాసం
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగమ్
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం
విష్ణుం వందే సర్వలోకైకనాథమ్. 5

ధర్మరాజు చెప్పెను—

తా॥ మేఘమువలె శ్యామవర్ణము గలవాడును, పచ్చని పట్టువస్త్రమును ధరించినవాడును, శ్రీవత్సమను గుఱుతుగలవాడును, కౌస్తుభమణిచే ప్రకాశించు దేహముగల వాడును, పుణ్యాత్ములగు భక్తులతో గూడినవాడును, తెల్ల

తామర రేకులవలె విశాలమైన నేత్రములు గలవాడును సమస్త లోకమునకును ఏకైక ప్రభువునగు విష్ణుదేవునకు వందన మాచరించెదను.

భీమసేన ఉవాచ—

జలౌఘమగ్నా సచరాచరాధరా
విషాణకోట్యాఖిల విశ్వమూర్తినా
సముద్ధృతా యేన వరాహరూపిణా
స మే స్వయంభూర్భగవాన్ ప్రసీదతామ్. 6

భీమసేనుడు చెప్పెను—

తా॥ స్థావరజంగమ ప్రాణికోట్లతో గూడిన భూమి నీటిలో మునుగగా విశ్వస్వరూపుడగు ఏ దేవుడు వరాహ రూపమును ధరించి తన కోరలతో పైకి లేవనెత్తెనో, అట్టి స్వయంభువుడగు భగవానుడు నాకు ప్రసన్నుడగుగాక!

వ్యాఖ్య :—విశ్వోద్ధారకుడు భగవానుడు. ఆతని యనుగ్రహమునకై భీమసేనుడు పై విధముగా ప్రార్థించు చున్నాడు.

అర్జున ఉవాచ—

అచిన్త్య మవ్యక్త మనన్త మవ్యయం
విభుం ప్రభుం భావిత విశ్వభావనమ్

త్రైలోక్య విస్తార విచారకారకం
హరిం ప్రపన్నోఽస్మి గతిం మహాత్మనామ్. 7

అర్జునుడు చెప్పెను—

తా॥ మనస్సుచే చింతింప నలవికానివాడును, వ్యక్తము కానివాడును, అంతము లేనివాడును, నాశరహితుడును, సర్వవ్యాపకుడును, జగత్ప్రభువును, విశ్వశ్రేయమును భావించు వాడును, మూడు లోకములను విస్తరింపజేయ దలంపుగల వాడును, మహాత్ములకు గతియు నగు శ్రీహరిని శరణు బొందు చున్నాను.

నకుల ఉవాచ—

యది గమన మధస్తాత్కాల పాశానుబద్ధో
యది చ కులవిహీనే జాయతే పక్షికీటే
కృమిశతమపి గత్వా జాయతే చాంతరాత్మా
మమ భవతు హృదిస్థే కేశవే భక్తిరేకా. 8

నకులుడు చెప్పెను—

తా॥ కాలపాశమునకు బద్ధుడనై ఒక వేళ నే నధో లోకములకు పోయినను, కులములేని పక్షులు, కీటకములు మున్నగువాని యందు జన్మించినను, వందలకొలదిగ నున్న పురుగుల జాతులలో పుట్టినను, (బాధ లేదు) నా హృదయ మున నున్న కేశవుని యందు భక్తి యొక్కటి యున్నచో చాలును (నే నానందింతును).

సహదేవ ఉవాచ—

తస్య యజ్ఞవరాహస్య విష్ణో రతుల తేజసః
ప్రణామం యే ప్రకుర్వన్తి తేషామపి నమోనమః. 9

సహదేవుడు చెప్పెను—

తా॥ యజ్ఞవరాహ స్వరూపుడును, నిరుపమాన మగు తేజస్సుతో విరాజిల్లువాడు నగు విష్ణుభగవానున కెవరు ప్రణమిల్లుదురో వారికి మఱల మఱల నమస్కారము చేసెదను.

కుంతీ ఉవాచ—

స్వకర్మఫలనిర్దిష్టాం యాం యాం యోనిం వ్రజామ్యహమ్
తస్యాం తస్యాం హృషీకేశ త్వయి భక్తిర్దృఢాఽస్తు మే. 10

కుంతీదేవి చెప్పెను—

తా॥ ఓ కృష్ణా! నా కర్మఫలము ననుసరించి నేను ఏయే ఉపాధులందు జన్మింతునో, ఆయా ఉపాధులందు నీయందు దృఢమగు భక్తి నాకు గలుగును గాక!

మాద్రీ ఉవాచ—

కృష్ణే రతాః కృష్ణమనుస్మరన్తి
రాత్రౌచ కృష్ణం పునరుత్థితా యే
తే భిన్నదేహాః ప్రవిశన్తి కృష్ణం
హవిర్యథా మంత్రహుతం హుతాశే. 11

మాద్రి చెప్పెను—

తా॥ ఎవరు కృష్ణునియం దాసక్తి కలవారై, కృష్ణునే నిరంతరము స్మరించుచుందురో, రాత్రులందు కృష్ణుని స్మరించుచునే నిద్రించుచు, మఱల ఉదయమున కృష్ణుని తలంచుచునే మేలుకొందురో, అట్టివారు దేహబంధమును దాటి, మంత్రములచే వ్రేల్చబడిన హవిస్సు అగ్నిలో లీనమగు నట్లు కృష్ణుని యందు ప్రవేశింతురు. (ముక్తు లగుదురు).

ద్రుపద ఉవాచ—

కీటేషు పక్షిషు మృగేషు సరీసృపేషు
రక్షః పిశాచమనుజేష్వపి యత్ర యత్ర
జాతస్య మే భవతు కేశవ త్వత్ప్రసాదా
త్త్వయ్యేవ భక్తి రచలాఽవ్యభిచారిణీ చ. 12

ద్రుపదుడు చెప్పెను—

తా॥ ఓ కేశవా! (కృష్ణా!) పురుగులలోను, పక్షుల లోను, మృగములలోను, ప్రాకులాడు (సర్పాది) జంతువుల లోను, రాక్షసులలోను, పిశాచములలోను, మనుష్యులలోను ఎక్కడెక్కడ నేను జన్మించినను సరియే, మీ యనుగ్రహము వలన అచటచట నిశ్చల సుస్థిర భక్తి మీ యందే నాకు ఉదయించు గాక!

సుభద్రా ఉవాచ—

ఏకోఽపి కృష్ణస్య కృతః ప్రణామో
దశాశ్వమేధావభృథేన తుల్యః
దశాశ్వమేధీ పునరేతి జన్మ
కృష్ణప్రణామీ నపునర్భవాయ. 13

సుభద్ర చెప్పెను—

శ్రీ కృష్ణునకు గావింపబడు నమస్కారము ఒక్కటియైనను పది అశ్వమేధయాగములయొక్క అవభృథ స్నానములతో సమానమైన పుణ్యము నొసంగును. అయితే, చిత్రమేమనగా పది అశ్వమేధ యాగములు చేసినవాడు మఱల జన్మించును గాని, శ్రీకృష్ణునకు వందనమొనర్చినవాడు మాత్రము మఱల జన్మింపడు. (జన్మరాహిత్యరూప కైవల్యమును బొందును.) .

అభిమన్యు ఉవాచ—

గోవింద గోవింద హరే మురారే
గోవింద గోవింద రథాంగపాణే
గోవింద గోవింద ముకుంద కృష్ణ
గోవింద గోవింద నమో నమస్తే. 14

అభిమన్యుడు చెప్పెను—

ఓ గోవిందా! గోవిందా! హరీ! మురారీ! గోవిందా! గోవిందా! చక్రపాణీ! గోవిందా! గోవిందా! ముకుందా! కృష్ణా! గోవిందా! గోవిందా! నీకు మఱల మఱల నమస్కారము!

ధృష్టద్యుమ్న ఉవాచ—

శ్రీరామ నారాయణ వాసుదేవ
గోవింద వైకుంఠ ముకుంద కృష్ణ
శ్రీ కేశవానంత నృసింహ విష్ణో
మాంత్రాహి సంసార భుజంగదష్టమ్. 15

ధృష్టద్యుమ్నుడు చెప్పెను.—

శ్రీరామా! నారాయణా! వాసుదేవా! గోవిందా! వైకుంఠవాసా! ముకుందా! కృష్ణా! కేశవా! అనంతా! నరసింహా! విష్ణూ! సంసార మనెడి సర్పముచే కఱవబడిన నన్ను రక్షింపుము!

సాత్యకి రువాచ—

అప్రమేయ హరే విష్ణో కృష్ణ దామోదరాచ్యుత
గోవిందానంత సర్వేశ వాసుదేవ నమోఽస్తుతే. 16

సాత్యకి చెప్పెను—

అప్రమేయా! హరీ! విష్ణూ! కృష్ణా! దామోదరా! వాసుదేవా! నీకు నమస్కారము.

ఉద్ధవ ఉవాచ—

వాసుదేవం పరిత్యజ్య యేఽన్యం దేవముపాసతే
తృషితాజాహ్నవీతీరేకూపం వాంఛన్తి దుర్భగాః. 17

ఉద్ధవుడు చెప్పెను—

ఎవరు సర్వాత్మకుడగు వాసుదేవుని (శ్రీకృష్ణుని) విడనాడి యితర దేవతల నుపాసించుదురో, అట్టి వారు గంగాతీరమున దప్పికగొని ఆ గంగాజలమును త్రాగక నూతి నీళ్ళను గోరు మందభాగ్యులవంటివారే యగుదురు.

ధౌమ్య ఉవాచ—

అపాం సమీపే శయనాసనస్థం
దివా చ రాత్రౌ చ యథాధిగచ్ఛతామ్
యద్యస్తి కించిత్సుకృతం కృతం మయా
జనార్దనస్తేన కృతేన తుష్యతు. 18

ధౌమ్యుడు చెప్పెను—

నీటియొద్దను, శయనించునపుడును, కూర్చుండునపుడును, పగటియందును, రాత్రియందును నే నేమైన పుణ్యము చేసియుండినచో, ఆ సుకృత విశేషముచే జనార్దనుడగు భగవానుడు సంతోషించుగాక! (అది శ్రీహరి ప్రీతికొఱకే యగుగాక యని భావము.)

సంజయ ఉవాచ

ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతా
ఘోరేషు వ్యాఘ్రాదిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం
విముక్త దుఃఖా సుఖినో భవన్తి. 19

సంజయుడు చెప్పెను—

దుఃఖపీడితులు, ఖేద పడువారు, దారిద్ర్యాదులచే క్షీణించువారు, భీతిని పొందువారు, భయంకరములగు పులులు మొదలగు క్రూరజంతువులకు జిక్కువారు, 'నారాయణ' అను పదమును మాత్ర ముచ్చరించి ఆయా దుఃఖములనుండి విముక్తు లగుదురు. సుఖములను గూడ బొందుదురు.

అక్రూర ఉవాచ—

అహం తు నారాయణదాస దాస
దాసస్య దాసస్య చ దాసదాసః
అన్యేభ్య ఈశో జగతో నరాణాం
తస్మాదహం చాన్యతరోఽస్మి లోకే. 20

అక్రూరుడు చెప్పెను—

నేను శ్రీమన్నారాయణుని దాసునియొక్క దాసుడైన వాని దాసునియొక్క దాసుని దాసదాసుడను. లోకములో భక్తరహితులగు నరులకంటె, ప్రభువులకంటె నే నితరుడనై యున్నాను.

విదుర ఉవాచ—

వాసుదేవస్య యే భక్తాః శాన్తా స్తద్గతమానసాః
తేషాం దాసస్య దాసోఽహం భవే జన్మని జన్మని. 21

విదురుడు చెప్పెను—

ఎవరు వాసుదేవునకు భక్తులై, శాంతులై, భగవదర్పిత చిత్తులై యుండురో, అట్టి వారి దాసుడనై నేను ప్రతి జన్మయందును ఉద్భవించుదును గాక!

భీష్మ ఉవాచ—

విపరీతేషు కాలేషు పరిక్షీణేషు బంధుషు
త్రాహి మాం కృపయా కృష్ణ శరణాగతవత్సల. 22

భీష్ముడు చెప్పెను—

శరణాగతవత్సలుడ వగు ఓ కృష్ణా! కాలపరిస్థితులు విపరీతముగా మారిపోయినప్పుడు, బంధువులు వినాశ మొందినప్పుడు, దయతో నన్ను కాపాడుము!

ద్రోణాచార్య ఉవాచ—

యే యే హతాశ్చక్రధరేణ రాజన్
త్రైలోక్యనాథేన జనార్దనేన
తే తే గతా విష్ణుపురీం ప్రయాతా
క్రోధోఽపి దేవస్య వరేణ తుల్యః. 23

ద్రోణాచార్యుడు చెప్పెను—

ఓ రాజా! ముల్లోకములకు అధిపతియు, చక్రమును ధరించినవాడును, జనార్దనుడు నగు శ్రీ కృష్ణునిచే ఎవరెవరు హతులయిరో వారందఱును విష్ణుపురి యగు వైకుంఠమునకు జనిరి. ఆహా! భగవంతుని కోపము కూడ వరముతో సమానముగ నున్నది!

కృపాచార్య ఉవాచ—

మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య
భృత్యస్య భృత్యఇతి మాం స్మరలోక నాథ. 24

కృపాచార్యుడు చెప్పెను—

మధుకైటభులను రాక్షసులకు శత్రు వగు ఓ జగన్నాథా! నా జన్మమును సఫల మొనర్చునదియు, నేను ప్రార్థింపదగినదియు, నీవు నాకనుగ్రహింపవలసినదియు ఇది యొక్కటియే అయియున్నది — అది యేది యనిన — 'నీ దాసులకు దాసులైనవారికి దాసులైనవారికి దాసులుగా నుండువారికి దాసత్వ మొనరించువారికి సేవలు చేయువారికి బటులై యున్న వారికి దాసునిగా నన్ను భావింపుము. (అదియే నాకు పదివేలు.)

అశ్వత్థామ ఉవాచ—

గోవింద కేశవ జనార్దన వాసుదేవ
విశ్వేశ విశ్వ మధుసూదన విశ్వనాథ
శ్రీపద్మనాభ పురుషోత్తమ పుష్కరాక్ష
నారాయణాచ్యుత నృసింహ నమోనమస్తే. 25

అశ్వత్థామ చెప్పెను—

గోవిందా! కేశవా! జనార్దనా! వాసుదేవా! విశ్వేశా! విశ్వరూపా! మధుసూధనా! విశ్వనాథా! పద్మనాభా! పురుషోత్తమా! పుష్కరాక్షా! నారాయణా! అచ్యుతా! నృసింహా! నీకు నమస్కారము! నమస్కారము!

కర్ణ ఉవాచ—

నాన్యం వదామి న శృణోమి న చిన్తయామి
నాన్యం స్మరామి న భజామి న చాశ్రయామి
భక్త్యా త్వదీయ చరణాంబుజమన్తరేణ
శ్రీ శ్రీనివాస పురుషోత్తమ దేహి దాస్యమ్. 26

కర్ణుడు చెప్పెను—

ఓ శ్రీనివాసా! పురుషోత్తమా! భక్తితో నీ పాదారవిందములను తప్ప ఇతరమగు దేనినిగూర్చి నేను చింతింపను, వినను, స్మరింపను, భజింపను, ఆశ్రయింపను. అట్టి నీ సేవా భాగ్యమునే నాకనుగ్రహింపుము!

ధృతరాష్ట్ర ఉవాచ—

నమో నమః కారణ వామనాయ
నారాయణాయామిత విక్రమాయ
శ్రీ శార్ఙ్గచక్రాబ్జగదాధరాయ
నమోఽస్తు తస్మై పురుషోత్తమాయ. 27

ధృతరాష్ట్రుడు చెప్పెను—

సమస్త జగత్తునకు కారణభూతుడును, వామనావతారమును గ్రహించినవాడును, నారాయణుడును, అపరిమిత పరాక్రమముగలవాడును, శంఖచక్రగదాపద్మములను ధరించినవాడును, పురుషోత్తముడు నగు ఆ భగవానునకు నమస్కారము!

గాంధారీ ఉవాచ—

త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బన్ధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ. 28

గాంధారి చెప్పెను—

ఓ దేవదేవా! నీవే నాకు తల్లివి. నీవే నాకు తండ్రివి. నీవే నాకు బంధువు. నీవే నాకు చెలికాడవు. నీవే నాకు విద్య. నీవే నాకు ధనము. నీవే నాకన్నియు అయి యున్నావు.

ద్రౌపదీ ఉవాచ—

యజ్ఞేశాచ్యుత గోవింద
మాధవానంత కేశవ
కృష్ణ విష్ణో హృషీకేశ
వాసుదేవ నమోఽస్తుతే. 29

ద్రౌపది చెప్పెను—

ఓ యజ్ఞేశ్వరా! అచ్యుతా! గోవిందా! మాధవా! అనంతా! కేశవా! కృష్ణా! విష్ణూ! హృషీకేశా! వాసుదేవా! నీకు నమస్కారము.

జయద్రథ ఉవాచ—

నమః కృష్ణాయ దేవాయ బ్రహ్మణేఽనన్తమూర్తయే
యోగేశ్వరాయ యోగాయ త్వామహం శరణంగతః.

జయద్రథుడు చెప్పెను—

పరబ్రహ్మ స్వరూపుడును, అనంతమూర్తియు, యోగేశ్వరుడును, యోగరూపుడును నగు శ్రీ కృష్ణదేవునకు నమస్కారము చేయుచున్నాను. ఓ దేవా! నిన్ను నేను శరణుబొందుచున్నాను.

వికర్ణ ఉవాచ—

కృష్ణాయ వాసుదేవాయ దేవకీనందనాయ చ
నందగోపకుమారాయ గోవిందాయ నమోనమః.31

వికర్ణుడు చెప్పెను—

వాసుదేవుని తనయుడును, దేవకీపుత్రుడును, నందగోపకుమారుడును, గోవిందుడు నగు శ్రీకృష్ణ పరమాత్మకు మఱల మఱల నమస్కారము.

సోమదత్త ఉవాచ—

నమః పరమకల్యాణ నమస్తే విశ్వభావన
వాసుదేవాయ శాన్తాయ యదూనాం పతయేనమః.32

సోమదత్తుడు చెప్పెను—

ఓ పరమకల్యాణరూపుడవగు దేవా! నీకు నమస్కారము! ఓ విశ్వస్రష్టా! నీకు నమస్కారము. వసుదేవ తనయుడును, యదునాథుడును, శాంతస్వరూపుడు నగు శ్రీ కృష్ణమూర్తికి నమస్కారము.

విరాట ఉవాచ—

నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణ హితాయచ
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమోనమః.33

విరాటుడు చెప్పెను—

పరబ్రహ్మస్వరూపుడును, దేవదేవుడును, గోబ్రాహ్మణులకు హితుడును, జగత్తునకు శ్రేయమును గలుగజేయువాడును, గోవిందుడు నగు శ్రీ కృష్ణమూర్తికి మఱల మఱల నమస్కరించుచున్నాను.

శల్య ఉవాచ—

అతసీ పుష్పసంకాశం పీతవాసస మచ్యుతమ్
యే నమస్యన్తి గోవిందం న తేషాం విద్యతేభయమ్. 34

శల్యుడు చెప్పెను—

అగిసె పుష్పమువంటి కాంతి (నీలమేఘచ్ఛాయ) కలవాడును, పచ్చని వస్త్రము ధరించినవాడును, అచ్యుతుడును నగు గోవిందున కెవరు నమస్కరింతురో వారికి భయమే యుండదు.

బలభద్ర ఉవాచ—

కృష్ణ కృష్ణ కృపాళు స్త్వమగతీనాం గతిర్భవ
సంసారార్ణవమగ్నానాం ప్రసీద పురుషోత్తమ. 35

బలభద్రుడు చెప్పెను—

పురుషోత్తముడవగు కృష్ణా! మీరు దయాపరులు. కావున సంసారమను సముద్రమున మునిగి దిక్కుతోచని జనులకు దిక్కు చూపించి రక్షింపుడు (అనుగ్రహింపుడు).

శ్రీకృష్ణ ఉవాచ—

కృష్ణ కృష్ణేతి కృష్ణేతి యో మాం స్మరతి నిత్యశః
జలం భిత్త్వా యథా పద్మం నరకా దుద్ధరామ్యహమ్. 36

శ్రీకృష్ణుడు చెప్పెను—

కృష్ణా! కృష్ణా! కృష్ణా! అని యెవడు నన్ను నిత్యము స్మరించుచుండునో, అట్టివానిని నేను జలమునుండి తామర పుష్పమును పైకి తీయునట్లు నరకము (పాపము) నుండి ఉద్ధరింతును.

సత్యం బ్రవీమి మనుజాః స్వయమూర్ధ్వ బాహు
ర్యో మాం ముకుంద నరసింహ జనార్దనేతి
జీవో జపత్యనుదినం మరణే రణే వా
పాషాణ కాష్ఠసదృశాయ దదామ్యభీష్టమ్. 37

ఓ మానవులారా! నేను చేతులు పైకెత్తి సత్యముగా చెప్పుచున్నాను — అదేమనగా — ఎవడు మరణ సమయమందుగాని, యుద్ధాది కర్మలందుగాని, లేక తదితర సమయములందుగాని ముకుందా! నరసింహా! జనార్దనా! అని నన్ను ప్రతిదినము కీర్తించుచుండునో అట్టివాడు ఎవడైనను ఆతనియొక్క యభీష్టమును నేను సిద్ధింపజేసెదను.

సూత ఉవాచ—

తత్రైవ గంగా యమునా చ వేణీ
గోదావరీ సింధు సరస్వతీ చ
సర్వాణి తీర్థాని వసంతి తత్ర
యత్రాచ్యుతోదార కథా ప్రసంగః. 38

సూతుడు చెప్పెను—

ఎచట భగవంతునిగూర్చి ఉత్తమమగు కథా ప్రసంగము జరుగుచుండునో అచటనే గంగ, యమున, కృష్ణవేణి, గోదావరి, సింధు, సరస్వతి మొదలైన సమస్త నదులు, తీర్థములు వచ్చి చేరును.

యమ ఉవాచ—

నరకే పచ్యమానం తు యమేన పరిభాషితమ్
కిం త్వయా నార్చితో దేవః కేశవః క్లేశనాశనః. 39

యముడు చెప్పెను—

నరకమునబడి దహింపబడుచున్న వానిని గూర్చి యమధర్మరా జిట్లు వచించెను ఓయీ! సమస్త క్లేశములను బోగొట్టునట్టి దేవదేవుడగు కేశవుని (భగవంతుని) నీ వేల పూజించకుంటివి ?

నారద ఉవాచ—

జన్మాన్తర సహస్రేణ తపోధ్యాన సమాధిభిః
నరాణాం క్షీణపాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే. 40

నారదుడు చెప్పెను—

వేలకొలది జన్మలలో గావింపబడిన తపస్సు, ధ్యానము, సమాధి మున్నగు సత్కర్మలచేత ఎవరియొక్క పాపములు నశించిపోయినవో, అట్టివారికే శ్రీకృష్ణునియందు భక్తి ఉదయించును.

ప్రహ్లాద ఉవాచ —

నాథయోని సహస్రేషు యేషు యేషు ప్రజామ్యహమ్
తేషు తేష్వచలా భక్తిరచ్యుతాస్తు సదా త్వయి. 41

ప్రహ్లాదుడు చెప్పెను—

ప్రభూ! అచ్యుతా! నేను ఎన్ని వేల జన్మల నెత్తినప్పటికిని ఆ యా జన్మలందు నీయెడల నిశ్చలమైన భక్తి నాకు సదా కలుగులాగున అనుగ్రహింపుము.

ప్రహ్లాద ఉవాచ—

యా ప్రీతిరవివేకానాం విషయేష్వనపాయినీ
త్వా మనుస్మరతః సామే హృదయాన్మాఽపసర్పతు. 42

ప్రహ్లాదుడు చెప్పెను—

మహాత్మా! నాశవంతములగు ప్రాపంచిక విషయములందు అవివేకుల కెట్టి ప్రీతి కలదో, అట్టి ప్రీతి మిమ్ములను ఎడతెగక స్మరించుచున్నట్టి నాయొక్క హృదయమునుండి తొలగకుండునట్లు అనుగ్రహింపుడు.

విశ్వామిత్ర ఉవాచ—

కిం తస్య దానైః కిం తీర్థైః కిం తపోభిః కిమధ్వరైః
యో నిత్యం ధ్యాయతే దేవం నరాణాం మనసిస్థితమ్. 43

విశ్వామిత్రుడు చెప్పెను—

మానవుల మనస్సులలో విరాజిల్లుచున్న దేవుని నిరంతరము ధ్యానించువానికి దానములతో గాని, తీర్థయాత్రలతో గాని, తపస్సులతో గాని, యజ్ఞములతో గాని ప్రయోజన మేమి ?

జమదగ్ని ఉవాచ—

నిత్యోత్సవ స్తదా తేషాం నిత్యశ్రీర్నిత్యమంగళమ్
యేషాం హృదిస్థో భగవాన్మంగళాయతనం హరిః. 44

జమదగ్ని చెప్పెను—

ఎవరి హృదయమున మంగళస్వరూపుడగు భగవంతుడు ధ్యానింపబడుచుండునో, అట్టివారికి నిత్యోత్సవము, నిత్యవైభవము. నిత్యమంగళము సంభవించుచుండును.

భరద్వాజ ఉవాచ—

లాభ స్తేషాం జయ స్తేషాం కుత స్తేషాం పరాజయః
యేషా మిందీవరశ్యామో హృదయస్థో జనార్దనః. 45

భరద్వాజుడు చెప్పెను—

ఎవరి హృదయములందు నల్లకలువలవలె శ్యామల వర్ణముగల జనార్దనుడు ధ్యానింపబడుచుండునో, అట్టివారికే లాభము, అట్టివారికే జయము కలుగుచుండును. కావున ఇక వారికి పరాజయ మెచట ?

గౌతమ ఉవాచ—

గో కోటిదానం గ్రహణేషు కాశీ
ప్రయాగ గంగాఽయుత కల్పవాసః
యజ్ఞాయుతం మేరుసువర్ణదానం
గోవిందనామ్నా న కదాపి తుల్యమ్. 46

గౌతముడు చెప్పెను—

గ్రహణ సమయములలో కోట్లకొలది గోవులను దాన మొనర్చినను, కాశీప్రయాగ గంగానది తీర్థములలో వేలకొలది సంవత్సరములు నివసించినను, వేలకొలది యజ్ఞములను చేసినను, మేరుపర్వతముతో సమానమైన బంగారమును దానమొనర్చినను, గోవిందనామ సంకీర్తనముతో సమాన మెప్పుడును కాజాలవు.

అత్రి ఉవాచ—

గోవిందేతి సదా స్నానం గోవిందేతి సదా జపమ్
గోవిందేతి సదా ధ్యానం సదా గోవిందకీర్తనమ్. 47

అత్రి చెప్పెను—

గోవిందా యనినచో నిత్యము స్నానముచేసినట్లగును. గోవిందా యనినచో నిత్యము జపించినట్లగును. గోవిందా యనినచో నిత్యము ధ్యానించినట్లగును. కావున సదా గోవిందనామ సంకీర్తనమును చేయవలయును.

అత్రి ఉవాచ—

అక్షరం హి పరం బ్రహ్మ గోవిందే త్య్రక్షర త్రయమ్
తస్మాదుచ్చరితం యేన బ్రహ్మభూయాయ కల్పతే. 48

అత్రి చెప్పెను—

పరబ్రహ్మము 'అక్షరము' అయి యున్నది (నాశ రహితమైనది). 'గోవిందు'డో మూడు అక్షరములతో గూడి యున్నాడు ('గోవింద' అను పదము మూడు అక్షరములతో గూడియున్నది). కాబట్టి గోవిందనామోచ్చారణ నెవడు చేయునో అతడు బ్రహ్మసాయుజ్యమును తప్పక బడయు చున్నాడు.

శ్రీ శుక ఉవాచ—

అచ్యుతః కల్పవృక్షోఽసావనంతః కామధేనవత్
చిన్తామణిశ్చ గోవిందో హరినామ విచిన్తయేత్. 49

శ్రీ శుకుడు చెప్పెను—

'అచ్యుత' అను నామము కల్పవృక్షమువలె కామితముల నొసంగును. 'అనంత' అను నామము కామధేనువు చందమున కోరికల నీడేర్చును. 'గోవింద' అను నామము చింతామణి భంగి వాంఛితముల నొసంగును. కాబట్టి అట్టి శ్రీహరి నామములను సదా స్మరించుచు చింతించుచుండవలెను.

హరి ఉవాచ—

జయతి జయతి దేవో దేవకీనందనోఽయం
జయతి జయతి కృష్ణో వృష్ణివంశ ప్రదీపః
జయతి జయతి మేఘశ్యామలః కోమలాంగో
జయతి జయతి పృథ్వీభారనాశో ముకుందః. 50

హరి వచించెను—

దేవకీనందను డగు దేవుడు విరాజిల్లుచున్నాడు. యాదవవంశప్రకాశకు డగు కృష్ణుడు తేజరిల్లుచున్నాడు. మేఘమువలె నీలకాంతి గల్గి కోమలమైన అవయవము గల ప్రభువు వర్ధిల్లుచున్నాడు. భూభారమును నశింపజేయు ముకుందుడు మిక్కిలి శోభిల్లుచున్నాడు.

పిప్పలాయన ఉవాచ—

శ్రీమన్నృసింహవిభవే గరుడధ్వజాయ
తాపత్రయోపశమనాయ భవౌషధాయ
కృష్ణాయ వృశ్చిక జలాగ్ని భుజంగరోగ
క్లేశవ్యయాయ హరయే గురవే నమస్తే. 51

పిప్పలాయనుడు చెప్పెను—

శ్రీమంతుడవగు ఓ నరసింహా! ప్రభుడవును, గరుడ ధ్వజుడవును, తాపత్రయములను అణచువాడవును, జనన మరణరూప సంసారరోగమునకు ఔషధమువంటివాడవును,

తేళ్ళు, జలము, అగ్ని, సర్పములు, రోగములు మున్నగు వానివలన కలుగు బాధలను పోగొట్టువాడవును, విష్ణువును, గురుదేవుడవును, కృష్ణుడవు నగు నీకు నమస్కారము చేయుచున్నాను.

అవిర్హోత్ర ఉవాచ—

కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాన్తే
అద్యైవ మే విశతు మానసరాజహంసః
ప్రాణప్రయాణసమయే కఫవాతపిత్తైః
కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే. 52

అవిర్హోత్రుడు చెప్పెను—

కృష్ణా! నీయొక్క పాదకమలములను పంజరమునందు నా మనస్సును రాజహంస ఇప్పుడే ప్రవేశించుగాక! ఏలయనగా ప్రాణ ప్రయాణసమయమునందు కఫవాతపిత్తములచే కంఠము కప్పివేయబడునపుడు నీ స్మరణ మెట్లు సాధ్యపడగలదు?

విదుర ఉవాచ—

హరేర్నామైవ నామైవ నామైవ మమ జీవనమ్
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా. 53

విదురుడు చెప్పెను—

శ్రీహరియొక్క నామమే ముమ్మాటికి నాకు జీవనము. కలియుగమున భగవన్నామము తప్ప తరించుటకు వేఱొక మార్గము లేనే లేదు.

వసిష్ఠ ఉవాచ—

కృష్ణేతి మంగళం నామ యస్య వాచి ప్రవర్తతే
భస్మీ భవన్తి తస్యాశు మహాపాతక కోటయః. 54

వసిష్ఠుడు చెప్పెను—

కృష్ణ యను మంగళకరమైన నామము ఎవని వాక్కునందు ప్రవర్తించునో అతని కోట్లకొలది మహా పాపములు కూడ శీఘ్రముగ నశించిపోవును.

అరుంధత్యువాచ—

కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే
ప్రణతక్లేశనాశాయ గోవిందాయ నమోనమః. 55

అరుంధతి చెప్పెను—

వాసుదేవుడును (సర్వభూతములందు నివసించువాడును), హరియు (పాపములను హరించువాడును); పరమాత్ముడును, నమస్కరించువారల బాధలను పోగొట్టువాడును, గోవిందుడు నగు శ్రీ కృష్ణునకు మఱల మఱల నమస్కారము.

కశ్యప ఉవాచ—

కృష్ణానుస్మరణాదేవ పాప సంఘాత పంజరః
శతధా భేదమాప్నోతి గిరిర్వజ్రహతో యథా. 56

కశ్యపుడు చెప్పెను—

శ్రీకృష్ణుడు స్మరణమాత్రముచే పాపసమూహ మను పంజరము వజ్రాయుధముచే పర్వతమువలె నూఱువక్కలై పోవును.

దుర్యోధన ఉవాచ—

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః
జానా మ్యధర్మం న చ మే నివృత్తిః
కేనాపి దేవేన హృది స్థితేన
యథా నియుక్తోఽస్మి తథా కరోమి. 57

దుర్యోధనుడు చెప్పెను—

నాకు ధర్మ మనగా నేమియో తెలియును. కాని దానిని చేయుటకు మనస్సు ఒప్పుటలేదు. నాకు అధర్మ మనగా నేమియో తెలియును. కాని దానిని విడుచుటకు మనస్సు ఒప్పుటలేదు. నా హృదయమందుగల ఒకానొక దైవముచే (సంస్కారముచే) నే నెట్లు ఆదేశింపబడుదునో ఆ ప్రకారము చేయుచుందును.

యత్ర స్వగుణదోషేణ క్షమ్యతాం మధుసూదనః
అహమేవమహం హన్తుం మమ దోషోనవిద్యతే. 58

'నేను, నేను' అని చేసిన గుణదోషములను మధుసూదనుడగు శ్రీహరి క్షమించుగాక ! ఈ ప్రకారముగ నా అహంకారమును నేను చంపుకొనుచున్నాను. కావున ఇక నాకు దోషము కలుగదు.

భృగు ఉవాచ—

నామైవ తవ గోవింద కలౌ త్వత్తః శతాధికమ్
దదాత్యుచ్చారణాన్ముక్తిం వినా అష్టాంగయోగతః. 59

భృగుమహర్షి చెప్పెను—

ఓ గోవిందా ! ఈ కలియుగమున నీ నామము నీ కంటె నూఱు రెట్లు అధికమై యున్నది. ఏలయనగా, శమదమాది అష్టాంగ యోగసాధనము లవసరము లేకుండగనే కేవలము ఉచ్చారణమాత్రముచేతనే అయ్యది జనులకు మోక్షము నొసంగుచున్నది.

లోమహర్షణ ఉవాచ—

నమామి నారాయణ పాదపంకజం
కరోమి నారాయణ పూజనం సదా
వదామి నారాయణ నామనిర్మలం
స్మరామి నారాయణ తత్త్వమవ్యయమ్. 60

లోమహర్షణుడు చెప్పెను—

నారాయణుని పాదపద్మములకు నమస్కారము చేయుదును. ఎల్లప్పుడు నారాయణుని పూజ లొనర్చుచుందును. నిర్మలమగు నారాయణుని నామమునే పలుకుచుందును. అవ్యయమగు నారాయణుని తత్త్వమునే స్మరించుచుందును.

శౌనక ఉవాచ—

స్మృత్వా సకలకల్యాణభాజనం యత్ర జాయతే
పురుషం తమజం నిత్యం వ్రజామి శరణం హరిమ్.

శౌనకుడు చెప్పెను—

ఎవరిని స్మరించినంత మాత్రముచేతనే మనుజుడు సమస్త శుభములకును నిలయుడగునో సమస్త దేహములలో క్షేత్రజ్ఞుడుగ నివసించువాడును, పుట్టుక లేనివాడును, నిత్యుడును అగు ఆ శ్రీహరిని నేను శరణుజెందుచున్నాను.

గర్గ ఉవాచ—

నారాయణేతి మంత్రోఽస్తి వాగస్తి వశవర్తినీ
తథాపి నరకే ఘోరే పతన్తీత్యేతదద్భుతమ్. 62

గర్గుడు చెప్పెను—

పవిత్రమగు 'నారాయణ' అను మంత్రము కలదు. ఉచ్చరించుటకు వాక్కు తన స్వాధీనముననే యున్నది. అయినప్పటికిని జనులు భయంకరమగు నరకమున బడుచున్నా రనునది చాల ఆశ్చర్యకరమైన విషయము!

దాల్భ్య ఉవాచ—

కింతస్య బహుభిర్మంత్రైర్భక్తిర్యస్య జనార్దనే
నమోనారాయణాయేతి మంత్రః సర్వార్థసాధనః. 63

దాల్భ్యుడు చెప్పెను—

ఎవనికి జనార్దనునియందు భక్తి కలదో, ఆతనికి పెక్కు మంత్రములవలన ప్రయోజన మేమి? 'ఓమ్ నమో నారాయణాయ' అను మంత్ర మొక్కటియే సర్వార్థసాధకమై యొప్పుచున్నది.

వైశంపాయన ఉవాచ—

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువానీతి మతిర్మమ. 64

వైశంపాయనుడు చెప్పెను—

ఎచట యోగీశ్వరుడగు శ్రీకృష్ణభగవాను డుండునో, ఎచట ధనుర్ధారియగు అర్జును డుండునో, అచట ఐశ్వర్యము, విజయము, సంపద, స్థిరమగు ధర్మము ఉండునని నా యభిప్రాయము.

అంగిరస ఉవాచ—

హరిర్హరతి పాపాని దుష్టచిత్తైరపి స్మృతః
అనిచ్ఛయాపి సంస్పృష్టో దహత్యేవహి పావకః. 65

ఆంగిరసుడు చెప్పెను—

దుష్టులు స్మరించినప్పటికిని శ్రీహరి వారి పాపములను పోగొట్టును. తెలియక తాకినను అగ్ని కాల్చివేయును గదా!

పరాశర ఉవాచ—

సకృదుచ్చరితం యేన హరిరిత్యక్షరద్వయమ్
బద్ధః పరికరస్తేన మోక్షాయ గమనం ప్రతి. 66

పరాశరుడు చెప్పెను—

'హరి' అను రెండక్షరములను ఒక్కసారి ఎవడు ఉచ్చరించునో, అతడిక మోక్షమునకు పోవుటకు సన్నాహమొనర్చినవాడే యగును.

పౌలస్త్య ఉవాచ—

హే జిహ్వే రససారజ్ఞే సర్వదా మధురప్రియే
నారాయణాఖ్యం పీయూషం పిబ జిహ్వే నిరంతరమ్. 67

పౌలస్త్యుడు చెప్పెను—

సమస్త రసముల సారమెఱిగినదానవును, నిత్యము మధుర రసమందు ప్రీతిగలదానవునగు ఓ నాలుకా! నారాయణ నామామృతమును నిరంతరము పానము చేయుము.

వ్యాస ఉవాచ

సత్యం సత్యం పునః సత్యం భుజ ముత్థాప్యచోచ్యతే
న వేదాచ్ఛ పరంశాస్త్రం న దేవః కేశవాత్పరః. 68

వ్యాసుడు చెప్పెను—

చేతులు పైకెత్తి నిజమును చెప్పుచున్నాను. నేను చెప్పునది ముమ్మాటికి నిజము. అది యేదనగా—వేదమును మించిన శాస్త్రము లేదు. కేశవుని మించిన దేవుడు లేడు.

ధన్వంతరి ఉవాచ—

అచ్యుతానంత గోవింద నామోచ్చారణ భేషజాత్
నశ్యన్తి సకలారోగాః సత్యం సత్యం వదామ్యహమ్. 69

ధన్వంతరి చెప్పెను—

అచ్యుత, అనంత, గోవింద మున్నగు భగవన్నామములను ఉచ్చరించుట ఒక దివ్యౌషధ సేవనము. దానిచే సమస్త రోగములు నశించిపోవును. ఈ నా వాక్యము ముమ్మాటికిని సత్యము.

మార్కండేయ ఉవాచ—

సాహానిస్తన్మహచ్ఛిద్రం సా చాంధజడమూఢతా
యన్ముహూర్తం క్షణమపి వాసుదేవం నచిన్తయేత్. 70

మార్కండేయుడు చెప్పెను—

ముహూర్తకాలముగాని, క్షణకాలముగాని వాసుదేవునిగూర్చి ధ్యానింపకుండుట యేది కలదో అదియే గొప్ప హాని, అదియే గొప్ప లోపము, అదియే గ్రుడ్డితనము, అదియే జడత్వము, అదియే మూఢత్వము అని తెలియ నగును.

అగస్త్య ఉవాచ—

నిమిషం నిమిషార్ధం వా ప్రాణినాం విష్ణుచిన్తనమ్
క్రతుకోటి సహస్రాణాం ధ్యానమేకం విశిష్యతే. 71

అగస్త్యుడు చెప్పెను—

నిమిషము గాని, అర నిమిషము గాని భగవంతుని ధ్యానించుట యనునది కోట్లకొలది యజ్ఞము లాచరించుట కంటెను శ్రేష్ఠతమమైనది.

మనసా కర్మణా వాచా యే స్మరన్తి జనార్దనమ్
తత్ర తత్ర కురుక్షేత్రం ప్రయాగో నైమిషం వనమ్. 72

ఎచ్చటెచట మనస్సుచేతను, క్రియలచేతను—అనగా త్రికరణశుద్ధిగా ఎవరు జనార్దనుని (భగవంతుని) స్మరించు చుందురో, అచటచట కురుక్షేత్రము, ప్రయాగ, నైమిశారణ్యము వెలయుచుండును. (అట్టి వారుండు చోట్లు పైన తెలిపిన క్షేత్రముల వలె మహా పవిత్రములై యలరారుచుండునని భావము.)

శుక ఉవాచ—

ఆలోడ్య సర్వశాస్త్రాణి విచార్యైవం పునఃపునః
ఇదమేకం సునిష్పన్నం ధ్యేయో నారాయణస్సదా. 73

శుకుడు చెప్పెను—

సకల శాస్త్రములను తిరుగవైచి, మరల మరల వానిని విచారించి చూచినచో ఒక్క విషయము మాత్రము స్పష్టముగ నిర్ణయింపబడిన దగుచున్నది. అది యేదనగా 'నారాయణునే ఎల్లప్పుడు ధ్యానించవలెను'– అనునది.

మహాదేవ ఉవాచ—

శరీరం చ నవచ్ఛిద్రం వ్యాధిగ్రస్తం కలేబరమ్
ఔషధం జాహ్నవీతోయం వైద్యోనారాయణోహరిః. 74

మహాదేవుడు చెప్పెను—

ఈ శరీరము తొమ్మిది రంధ్రములు కలది, రోగముల చే ఆక్రమింపబడునది. దీనికి గంగాజలమే ఔషధము. నారాయణుడైన శ్రీహరియే వైద్యుడు.

శౌనక ఉవాచ—

భోజనాచ్ఛాదనే చిన్తా వృథా కుర్వన్తి వైష్ణవాః
యోఽసౌ విశ్వంభరో దేవః సభక్తాన్ కిముపేక్షతే. 75

శౌనకుడు చెప్పెను—

భగవద్భక్తులగువారు భోజన, వస్త్రాదులను గూర్చి వ్యర్థముగ చింతింపరాదు. సమస్త విశ్వమును పాలించి పోషించునట్టి భగవానుడు తన భక్తులను విడనాడునా? (తన్ను నమ్మినవారలకు అన్నవస్త్రాదు లిచ్చి తప్పక కాపాడు నని భావము.)

సనత్కుమార ఉవాచ—

యస్య హస్తే గదా చక్రం గరుడో యస్య వాహనమ్
శంఖః కరతలే యస్య స మే విష్ణుః ప్రసీదతు. 76

సనత్కుమారుడు చెప్పెను—

ఎవని చేతులలో శంఖము, చక్రము, గద శోభిల్లు చున్నవో, ఎవనికి గరుత్మంతుడు వాహనమై యొప్పు చున్నాడో అట్టి విష్ణుభగవానుడు నా యెడల ప్రసన్నుడగు గాక! (నన్ను రక్షించుగాక!)

శాండిల్య ఉవాచ—

జలే రక్షతు వారాహః స్థలే రక్షతు వామనః
అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతు కేశవః. 77

శాండిల్యుడు చెప్పెను—

జలమందు వరాహమూర్తి రక్షించుగాక! భూమిపై వామనమూర్తి కాపాడు గాక! అడవియందు నరసింహ

మూర్తి ప్రోచుగాక! విష్ణుభగవానుడు ఎల్లెడల అనుగ్రహించుగాక!

కృతవర్మ ఉవాచ—

శంఖచక్రగదాపాణే ద్వారకానిలయాచ్యుత
గోవింద పుండరీకాక్ష రక్ష మాం శరణాగతమ్. 78

కృతవర్మ చెప్పెను—

శంఖము, చక్రము, గద చేతులలో గలవాడవును, ద్వారకయందు నివసించువాడవునగు ఓ అచ్యుతా! గోవిందా! పుండరీకాక్షా! శరణుబొందిన నన్ను రక్షింపుము.

పవన ఉవాచ—

గోవిందేతి పరం బ్రహ్మ గోవిందేతి త్రియక్షరమ్
సకృదుచ్చరితం యేన విష్ణోస్సాయుజ్య మాప్నుయాత్. 79

పవనుడు చెప్పెను—

గోవింద అనునది పరబ్రహ్మముయొక్క వాచకము. గోవింద అనునది మూడక్షరములతో గూడిన మహా మంత్రము. అట్టి పరమ పవిత్రమగు గోవిందనామమును ఎవడు ఒక్క పర్యాయము ఉచ్చరించునో అతడు విష్ణు సాయుజ్యమును బొందును.

నైఋత ఉవాచ—

యద్దినం హరిసల్లాపకథాపీయూషవర్జితమ్
తద్దినం దుర్దినం మన్యే మేఘచ్ఛన్నం న దుర్దినమ్. 80

నైఋతుడు చెప్పెను—

ఏ దినమందు మనుజుడు భగవత్కథామృతమును గ్రోలకుండ, భగవన్నామమును జపించకుండ గడిపివైచునో, అదియే దుర్దిన మని చెప్పబడును గాని, మేఘముచే గప్పబడి సూర్యుడు కనుపించకుండ ఉండుదినము దుర్దినము కాజాలదు. (దుర్దిన మను పదమునకు సూర్యుడు మేఘాచ్ఛాదితుడై యుండు దిన మని అర్థము కలదు.)

వినాయక ఉవాచ—

నారాయణేతి మంత్రేణ చతురక్షర్యహర్నిశమ్
యన్మనో విలయం యాతి తస్య విష్ణోః పరంపదమ్.81

వినాయకుడు చెప్పెను—

'నారాయణ' అను నాలు గక్షరముల మంత్రమును నిరంతరము జపించుచు ఎవనియొక్క మనస్సు విలయ మొందునో, ఆతనికి విష్ణుభగవానుని మహోన్నత పదము సంప్రాప్తించును.

భాస్కర ఉవాచ—

ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ
నారాయణస్సరసిజాసనసన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ
హరీ హిరణ్మయవపుర్ధృతశంఖచక్రః. 82

భాస్కరుడు చెప్పెను—

సూర్యమండలమధ్యమున సదా విరాజిల్లుచుండువాడును, పద్మాసనమున ఉపవిష్టుడై యుండువాడును, కేయూరములు, మకరకుండలములు, కిరీటము, ముత్యాల హారములు గలిగి శంఖచక్రాదులను ధరించి సువర్ణమయ కాంతియుక్తమగు దేహముతో ప్రకాశించు శ్రీమన్నారాయణుని చక్కగ ధ్యానము చేయవలెను.

వాలఖిల్య ఉవాచ—

ఇదం శరీరం శతసంధిజర్జరం
పతత్యవశ్యం పరిణామదుర్లభమ్
కిమౌషధం పశ్యసి మూఢ దుర్మతే
నిరామయం కృష్ణరసాయనం పిబ. 83

వాలఖిల్యుడు చెప్పెను—

ఓ మూఢుడా! ఈ శరీరము పలువిధములగు సంధులతో గూడినది. అనుక్షణము మార్పు చెందునది. అవశ

ముగ పతన మొందునది. దీనిని రక్షించుటకై ఔషధాదుల కొఱకు బాధపడుచున్నావేమి? దుర్మతీ! సకల రోగములను పోగొట్టునట్టి శ్రీకృష్ణనామామృతమును పానము చేయుము.

సనత్కుమార ఉవాచ—

నాస్తి నాస్తి మహాభాగ కలికాల సమం యుగమ్
స్మరణాత్కీర్తనాదేవ ప్రాప్నోతి పరమాం గతిమ్. 84

సనత్కుమారుడు చెప్పెను—

ఓ మహాశయా! కలికాలముతో సమానమైన యుగము లేదు. ఏలయనగా, ఈ యుగమునందు భగవంతుని స్మరించినను, కీర్తించినను చాలును. మనుజుడు సర్వోత్తమమగు మోక్షపదవిని పొందగలడు.

కణ్వ ఉవాచ—

హృది రూపం ముఖే చిహ్నం నైవేద్యముదరే తథా
తులసీ పాదతీర్థం చ మస్తకే యస్యసోఽస్మ్యహమ్. 85

కణ్వుడు చెప్పెను—

ఎవని హృదయమున భగవద్రూపము స్మరింపబడునో, ఎవని ముఖమున భగవచ్చిహ్నములగు తిలకాదులు విరాజిల్లునో, ఎవని ఉదరమున భగవన్నివేదితములైన ప్రసాదాదులుండునో, ఎవని శిరస్సుపై భగవదర్పిత తులసీదళ పాదతీర్థాదు లుండునో, అట్టివానికి నేను ఆత్మీయుడను.

భార్గవ ఉవాచ—

తదేవ లగ్నం సుదినం తదేవ
తారాబలం చంద్రబలం తదేవ
విద్యాబలం దైవబలం తదేవ
లక్ష్మీపతే తేఽంఘ్రియుగం స్మరామి. 86

భార్గవుడు చెప్పెను—

ఓ లక్ష్మీనాథా! నీ పాదయుగళమును నేను స్మరించుచుందును. నాకదియే శుభలగ్నము. అదియే సుదినము. అదియే తారాబలము, అదియే చంద్రబలము, అదియే విద్యాబలము, అదియే దైవబలము.

పరీక్షిత్ ఉవాచ—

నమోఽస్మదాచార్య పరంపరాభ్యో
నమో నమో భాగవతవ్రజేభ్యః
నమో నమోఽనన్తముఖావరేభ్యో
నమశ్శ్రియై శ్రీపతయే నమోఽస్తు. 87

పరీక్షితుడు చెప్పెను—

మా ఆచార్య పరంపరలోనివారి కందఱకు నమస్కారము. భాగవతోత్తము లందఱికి నమస్కారము. అనంతుడు మొదలైన ప్రముఖులకు నమస్కారము. లక్ష్మీదేవికి నమస్కారము. లక్ష్మీపతియగు నారాయణునకు నమస్కారము!

ఏవం బ్రహ్మాదయోదేవా ఋషయశ్చ తపోధనాః
కీర్తయన్తి సురశ్రేష్ఠం దేవం నారాయణం విభుమ్. 88

ఈ ప్రకారముగ బ్రహ్మాదిదేవతలును, తపోధనులగు ఋషులును సురశ్రేష్ఠుడై, ప్రభువై, దేవదేవుడై చెన్నొందు శ్రీమన్నారాయణుని కీర్తించుచుందురు,

ఇదం పవిత్రమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్
యః పఠేత్ ప్రాతరుత్థాయవైష్ణవంస్తోత్రముత్తమమ్. 89

సర్వపాప వినిర్ముక్తో విష్ణుసాయుజ్య మాప్నుయాత్
ధర్మార్థకామమోక్షార్థం పాండవైః పరికీర్తితమ్. 90

ధర్మార్థ కామ మోక్షముల కొఱకై పాండవులచే కీర్తింపబడిన ఈ పాండవగీత పవిత్రమును, ఆయుర్వర్ధకమును, పుణ్యదాయకమును, పాపవినాశకరము అయి యున్నది. ఉత్తమమగు ఈ విష్ణుసంబంధ (భగవత్సంబంధ) స్తోత్రమును ఎవడు ప్రాతఃకాలమున లేచిన పిదప చదువునో అతడు సమస్త పాపములనుండి విముక్తుడై విష్ణు సాయుజ్యమును పొందగలడు.

ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్
సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి. 91

ఆకాశమునుండి పడిన జలములు సముద్రమును చేరు నట్లు సమస్త దేవతలకును గావింపబడిన నమస్కారములు కేశవునే (పరమాత్మునే) చేరుచున్నవి.

ఇతి శ్రీ పాండవగీతా సమాప్తా. శ్రీ కృష్ణార్పణమస్తు.

ఓమ్

దైవ ప్రార్థన

కరుణామూర్తియగు సర్వేశ్వరా! మా చిత్తము సర్వకాల సర్వావస్థల యందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము!

పరమదయానిధీ! ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువరకును మనోవాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము. సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా! మా యంతఃకరణము నందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పముగాని విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము! వేదాంతవేద్యా! అభయస్వరూపా! మా యందు భక్తి, జ్ఞాన. వైరాగ్య బీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుము. మఱియు ఈ జన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తిసామర్థ్యములను కరుణతో నొసంగుము. దేవా! నీవు భక్తవత్సలుడవు! దీనులపాలిటి కల్పవృక్షమవు! నీవు తప్ప నాకు ఇంకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిని. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము! తపస్సునుండి జ్యోతిలోనికి తీసికొని పొమ్ము! మృత్యువునుండి అమృతత్వమును పొందింపజేయుము. ఇదే మా వినతి. అనుగ్రహింపుము. నీ దరిజేర్చుకొనుము.

పాహిమాం. పాహిమాం, పాహిమాం, పాహి॥

ఓం తత్ సత్

ॐ

మృత్యుంజయ మహామంత్రము

ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనమ్
ఉర్వారుక మివ బన్ధనా న్మృత్యో ర్ముక్షీయ మాఽమృతాత్

సుగంధ యుక్తులును, సమస్త జీవులను లెస్సగా పోషించువారును నగు త్రినేత్రుడైన పరమశివుని మేము ఆరాధించుచున్నాము. దోస తీగనుండి దోసకాయను వేరుచేయునట్లు మోక్షప్రాప్తి కొఱకై ఆ పరమాత్మ మమ్ములను మృత్యువు నుండి విడుదల చేయునుగాక!

(ఈ మృత్యుంజయ మంత్రము ప్రాణముల నివ్వ సమర్థమైనది. రోగములు నివారించుటలో, ప్రమాదముల తొలగించుటలో దీనికి పెట్టినది పేరు. ఇది రోగములన్నింటికి వజ్రాయుధము వంటిది. ఇది మృత్యువు జయించు మంత్రము.

ప్రతిదినము భక్తి శ్రద్ధలతో ఈ మంత్రమును కనీసము 108 సార్లు జపించినచో, ఏ విధమైన ప్రమాదములు, అపమృత్యు భయము లేకుండ కాపాడుటయేగాక, దీర్ఘాయువును, శాంతి సౌఖ్యములను ప్రసాదించును.

ఇంతేగాక ఇది మోక్షప్రదమగు మంత్రము కూడా. ఇది పరమశివుని మంత్రము. నిరంతరము జపించువారికి అమరత్వము గూడ ప్రసాదింపగలదు.)